## క్లుప్తంగా

### క్షీరారామంలో గోవులు సురక్షితం



గోవులను పర్యవేక్షిస్తున్న వెటర్నరి వైద్యుడు మల్లేశ్వరరావు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయ గోశాలలో ఉన్న గోవులన్నీ సురక్షితంగా ఉన్నట్టు వెటర్నరీ వైద్యుడు ఏడీ మల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. గోశాలలో గోవులను పరీక్షించారు. గోవులకు పెట్టే దాణాపై కొన్ని సూచనలు చేశారు. వైరస్‌లు సోకకుండా ఆరు నెలలకు ఓ సారి వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు పాల్గొన్నారు.

### వైభవంగా స్వామివారి చక్రస్నానం



స్వామివారి చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక శ్రీ ఎంబేరుమానార్ దేవస్థానంలో ఆదికేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఆదికేశవస్వామికి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ స్థానాచార్యులు కిడాంబి వెంకటాచార్యులు, ప్రధానార్చకుడు పెద్దింటి మోహన రామాచార్యులు, ఈఓ ఆర్‌వీవీఎస్ రామచంద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### సైన్స్ టూర్‌కు విద్యార్థులు



సైన్స్ టూర్‌కు బయలుదేరిన విద్యార్థులు

ఆకివీడు: సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన ఎంపీపీ స్కూల్ విద్యార్థులను పలు ప్రాంతాల్లో టూర్‌కు పంపుతున్నట్లు ఎంఈఓ ఎ.రవీంద్ర, ఎంఈఓ–2 సీతారామయ్య చెప్పారు. మండలంలోని ఆరుగురు విద్యార్థులు సోమవారం టూర్‌కు బయలుదేరారు. యానాం జిప్మర్ ఆసుపత్రి, కోరంగి మడ అడవులు, విశాఖ పట్టణంలోని సబ్‌మెరైన్, యుద్ధ విమాన, ఆర్కియాలజికల్ మ్యూజియంలను సందర్శిస్తారని చెప్పారు. .

### రేకుల షెడ్డు దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన రేకుల షెడ్డు

ఆకివీడు: గ్యాస్ సిలిండర్ ట్యూబ్ లీకై మంటలు చెలరేగి రేకుల షెడ్డుపై ఉన్న కొబ్బరి ఆకులు సోమవారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. సంఘటనలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు చెప్పారు. గ్రామంలో నివసిస్తున్న మద్దా మంగ మధ్యాహ్నం టీ కాసుకునేందుకు స్టౌవ్ వెలిగించగా, స్టౌవ్ వద్ద ఉన్న ట్యూబ్ ఊడిపోవడంతో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఇంట్లో తడికలు, తాటాకులతో నిర్మించిన గోడకు నిప్పంటుకుంది. సంఘటనలో ప్రాణ నష్టం వాటిల్లలేదని నాగేశ్వరరావు వివరించారు.

### బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో అనధికారికంగా బెల్టుషాపు నిర్వహిస్తున్న మానికి చెందిన బొక్కా రాజును ఎక్సైజ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని భీమవరం ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై పి.సునీల్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ బలరామరాజు, ఎస్సై ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

### నేడు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పర్యటన

భీమవరం: ఉండి నియోజకవర్గంలో అక్రమంగా పేదల ఇళ్లను తొలగిస్తున్న ప్రాంతాలను పరిశీలించి బాధితులను పరామర్శించేందుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం పర్యటించనున్నారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎస్‌వీ గోపాలన్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గంలోని ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల్లో దుర్మార్గంగా ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు కూల్చి వేస్తున్నారని దీంతో బాధితులు చిన్న పిల్లలు, వృద్ధులతో కుటుంబాలు రోడ్డున పడ్డారని గోపాలన్ ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు బాధితులను పరామర్శించి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు గోపాలన్ తెలిపారు.

# కూలీల వేతన వెతలు

- ముందుకు సాగని ఉపాధి హామీ పనులు
- నాలుగు నెలలుగా పస్తులు
- పట్టించుకోని పాలకులు



వేములదీవిలో పనులు చేస్తున్న ఉపాధి హామీ హామీ కూలీలు

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి కూలీలకు సకాలంతో వేతనాలు అందడంలేదు. రెక్కాడితే కాని డొక్కాడని కూలీలకు నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వారం వారం వేతనాలు వస్తాయని ఆశించి పనులు చేసిన కూలీలు నిరాశతో ఎదురు చూస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు కాపోవడంతో కూలీలు ఆకలితో అలమటిస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏడాదిలో ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించి ప్రతి 15 రోజులకు ఒకసారి కూలి డబ్బులు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మండుటెండల్లో శ్రమించిన కూలీలకు నెలల తరబడి వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. వేతనాలు సకాలంతో అందకపోయినా అధికారులు పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. పనులకు కూలీలు రాకపోవడంతో ఉపాధి పనుల లక్ష్యాన్ని అధిగమించడానికి సిబ్బందికి తలనొప్పిగా మారింది. ఇటీవల వరకు రూ.300 ఉన్న రోజువారీ కూలీ ఏప్రిల్ ఒకటి నుంచి కేంద్ర ప్రభుత్వం రూ.307కు పెంచింది. ప్రతి మండలంలో రోజులు వెయ్యి నుంచి రెండు వేలకు పైబడి కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. వీరు ఉదయం ఆరు గంటలకు వెళ్లి మధ్యాహ్నం 11 గంటల వరకు పనిచేసి ఇళ్లకు వస్తున్నారు. జనవరి నుంచి కూలి చెల్లించక పోవడంతో కూలీలకు ఎదురుచూపులు తప్పడంలేదు.

**బకాయిలు రూ.1.20 కోట్లు**

మండలంలోని 28 పంచాయతీల్లో ఏడు వేలకు పైబడి జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం 2000 జాబ్ కార్డుదారులు పనులు చేస్తున్నారు. కాలువల పూడికతీత, పంట బోదెల తవ్వకం, చెరువుల తవ్వకం, వంటి పనులు చేపడుతున్నారు. జనవరి నెల నుంచి నరసాపురం మండలంలో రూ.1.20 కోట్లు కూలి కూలీలకు చెల్లించాల్సి ఉందని ఏపీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ డబ్బులు రేపో మాపో చెల్లించేస్తారని చెప్పారు.

**సిబ్బందికీ జీతాల్లేవు**

ఉపాధి హామీ పథకం విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కూడా నాలుగు నెలలుగా జీతాలు అందలేదు. మండలంలో ఏపీఓ ఒకరు, ఈసీ ఒకరు, టెక్నికల్ అసిస్టెంట్ ఒకరు, కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌ల్లు మొత్తం 28 మంది పనిచేస్తున్నారు. వీరంతా జీతాల కోసం ఎదురు చూస్తున్నారు.

**బిల్లుల చెల్లింపులో జాప్యం**



ఉపాధి హామీ పథకం కింద నాలుగు నెలలుగా బిల్లులు రాక అవస్థలు పడుతున్నాం. ఈ పనుల పైనే ఆధారపడ్డాం. బిల్లులు చెల్లింపులో ప్రభుత్వం చాలా ఆలస్యం చేడం మాకు భారంగా మారింది. చేసిన పనులకు వేతనాలు ఇవ్వడంలేదు. దీనిపై అధికారులను అడిగినా ఎవరూ పట్టించుకోవడంలేదు. రేపుమాపంటూ కాలం వెళ్ల దీస్తున్నారు. వెంటనే డబ్బులు ఇప్పించండి.

– మిద్దే సత్యనారాయణ, లక్ష్మణేశ్వరం

### నేడు ఏఎస్ఎన్ఎం కళాశాలలో ఆధార్ శిబిరం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆధార్ కార్డ్ సవరణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ అవకాశాన్ని పాలకొల్లు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డులో తప్పులతో పాటు నూతన కార్డులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని వివరించారు.

### రేపు చాంబర్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు

పాలకొల్లు సెంట్రల్: చాంబర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎంఎస్ఎస్ ల్యాబరేటరీలో ఆర్అండ్‌డీ, క్యూసి, ప్రొడక్షన్లలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ చేసిన వారు అర్హులని, అలవెన్స్‌లు రూ.20 నుంచి రూ.25 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 99120 46234, 94935 03441లో సంప్రదించాలని తెలిపారు.

### 24న ఏఎస్ఎన్ఎం కళాశాలలో జాబ్‌మేళా

పాలకొల్లు సెంట్రల్: అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న జాబ్‌మేలా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఫాక్సాన్, ఫ్యూజన్ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, అపోలో ఫార్మసి, డెక్కన్ కెమికల్స్, పేటీఎం బ్లూస్టార్, కోజెంట్, టాటా రేడియేటర్స్ వంటి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన నిరుద్యోగులు అర్హులని, తెలిపారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఎస్ఆర్ఐఏఎస్ఎన్ఎంజీడీఓపీఏఎల్ఏకేఓఎల్ డాట్ ఏసీ డాట్ ఐఎన్‌లో చూడాలన్నారు.

### అంబేడ్కర్ అభిమానుల ర్యాలీ

యలమంచిలి: అంబేడ్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా సోమవారం అంబేడ్కర్ యూత్ సభ్యులు నేరేడుమిల్లి గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డీజే సౌండ్స్ ఏర్పాటుచేసి, అంబేడ్కర్ చిత్ర పటాన్ని, జెండాలను పట్టుకుని యువకులంతా గ్రామంలోని అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మంగళవారం దళిత కాలనీలో అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు జల్లి నాగేశ్వరరావు, జల్లి వరప్రసాద్, మానుకొండ మురళి, ముంగర మణికుమార్, దాకే రాంబాబు, గుండే మహేష్, కాలాబత్తుల రాంబాబు తెలిపారు.

### 25 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు తెలిపారు. ఈ నెల 25 నుంచి మే 7 వరకు ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులు వేసవి సెలవుల్లో ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పోషకాహారంతో వ్యాధినిరోధక శక్తి



పెనుగొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ



కొడమంచిలిలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు

పెనుగొండ: ప్రతిఒక్కరూ పోషకాలు ఉన్న ఆహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పెనుగొండ గ్రామ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి సూచించారు. సోమవారం పెనుమంట్ర ప్రాజెక్టు పరిధిలోని పెనుగొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పోషకాలు తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఎ.కృష్ణకుమారి, పెనుగొండ, ఆచంట, పెనుమంట్ర మండలాల సూపర్‌వైజర్లు బి.సుజాత, వి.రూతుకుమారి, ఎం విజయకుమారి, శ్యామలాంబ, సూర్యకుమారి, టి.పోచమ్మ, మహిళా పోలీసులు రమ్య, ప్రిస్కిల్లాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**కొడమంచిలిలో పోషణ్ పక్వాడా**

ఆచంట మండలం కొడమంచిలి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వెయ్యి రోజుల గురించి అవగాహన, అనుబంధ పోషకాహారం, ప్లాస్టిక్ వాడకం నిరోధం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడిచెత్త వంటి వాటిపై అవగాహన కల్పించారు. పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ డి.సూర్యకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంహెచ్‌పీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మందులు సక్రమంగా వాడాలి



బాధితులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రియదర్శిని

పాలకొల్లు సెంట్రల్: లెప్రసీ బాధితులు మందులను సక్రమంగా వాడాలని రాష్ట్ర నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ లెప్రసీ కన్సల్టెంట్ డాక్టర్ ప్రియదర్శిని అన్నారు. సోమవారం స్థానిక లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ ప్రియదర్శిని సందర్శించారు. లెప్రసీ కొత్త కేసులు గుర్తించి, వారు మందులు సక్రమంగా వాడేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. లెప్రసీకేసులు ఎన్ని ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్, ఎంపీ రమేష్, జక్కంపూడి రాంప్రసాద్, జీవీఎస్ఎన్ మూర్తి, గుడాల హరిబాబు, పి.ఎలిజిబెత్ తదితరులు పాల్గొన్నారు.

# ‘మీ కోసం’లో ఫిర్యాదుల వెల్లువ



ప్రజల సమస్యలు వింటున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: ప్రజా ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ దాసి రాజు అధికారులను ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమంలో ఆయన డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 42 ఫిర్యాదులు అందాయని ఆర్డీఓ తెలిపారు. సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లను ఆర్డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**శ్మశాన వాటికకు దారి చూపండి**

యలమంచిలి: కాంభోట్లపాలెం గ్రామంలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న దళిత శ్మశాన వాటికకు వెళ్లే దారి ఆక్రమణను తొలగించాలని గ్రామానికి చెందిన మంద రమేష్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారు. దీనికి తగు పరిష్కారం నిమిత్తం సంబంధిత పంచాయతీ కార్యదర్శికి పంపినట్లు తహసీల్దార్ గ్రంథి నాగ వెంకట పవన్‌కుమార్ తెలిపారు.

# మెగా మెడికల్ క్యాంపు



మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న యూనియన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఎలక్ట్రానిక్ వర్కర్లు నిత్యం సూక్ష్మ పరికరాలను చూస్తూ మరమ్మతులు చేయడంతో కంటి చూపు ప్రధాన సమస్యగా తయారైందని టీవీ మెకానిక్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ చెరుకూరి దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక వీవర్స్ కాలనీలో వీవర్స్ కమ్యూనిటీ హాలులో ఐఎఫ్‌టీయూ అనుబంధ జిల్లా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. బీపీ, షుగర్‌లతో పాటు కంటి పరీక్షలు నిర్వహించామని, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయడానికి సంఘం కృషి చేస్తుందని దుర్గా ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, సెక్రటరీ నల్లా శివకుమార్, మామిడి దానవరప్రసాద్, యస్ రామ్మోహన్, బండి దుర్గాప్రసాద్, జమితార చంద్రశేఖర్, కట్టోజు భాస్కర్, కొల్లి బ్రహ్మాజి తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ రమణకు సేవా అవార్డు



రమణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: ములపర్రుకు చెందిన ఫైర్ కానిస్టేబుల్ బీవీ రమణను పాలకొల్లు లైన్స్ క్లబ్ అత్యుత్తమ సేవా అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ మేరకు రమణ సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ రమణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలకు గాను అవార్డుతో సత్కరించారని చెప్పారు. కరోనా సమయంలో 10 గ్రామాల పేదలకు రెండు నెలలు పాటు ఆహారాన్ని అందించడం, రూ.10 లక్షల వ్యయంతో కైలాస రథం, ఫ్రీజర్ బాక్స్, ఆక్సిజన్ కంటైనర్ ఏర్పాటు, ఇరగవరం మండలం కాకిలేరు పేద విద్యార్థి హిమబిందు ఉన్నత చదువుకు రూ.30 వేలు సాయం చేసినట్టు చెప్పారు. ఈ సేవలను గుర్తించి సేవా అవార్డుతో సత్కరంచారని వివరించారు. పెనుగొండ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ హనుమంతురావు సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రమణను పాలకొల్లు సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవీ జానకి రామ్, ఫైర్ సిబ్బంది పాలకొల్లు లయన్స్ అధ్యక్షుడు జయభరతా రెడ్డిలు అభినందించారు.

# స్కీం వర్కర్ల ధర్నా




పెనుగొండలో తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న స్కీం వర్కర్లు

పెనుగొండ: స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పాఠశాలల ఆయాలు పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తహసీల్దారు జి.అనితకుమారికి వినతి పత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాసే విధంగా కోడ్స్ తీసుకొచ్చాయని, వీటి వల్ల కార్మికులు పనిభారాన్ని ప్రశ్నించే అవకాశం కోల్పోనున్నారని తెలిపారు. శ్రమ దోపిడి చేసేందుకు యజమానులకు అనుకూలంగా కోడ్స్ రూపకల్పన చేశారని విమర్శించారు. ప్రైవేటీకరణ విధానాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

### సమస్యలపై 12 అర్జీలు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 12 అర్జీలు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. డ్వాక్రా గ్రూపు సభ్యుల్లో ప్రభుత్వ ఉద్యోగులున్నారని, ప్రభుత్వ రాయితీలు పొందుతున్నారని, పట్టణంలో ఎన్ని గ్రూపులున్నాయో తెలపాలని మోరా రామిరెడ్డి ఫిర్యాదు చేశారని చెప్పారు. నాన్ లేఅవుట్లలో నిర్మిస్తున్నారని, ఇతర సమస్యలపై పలు సార్లు ఫిర్యాదు చేసినా, ఎండార్స్‌మెంట్ ఇస్తున్నారే గాని సమస్య పరిష్కారం కావడం లేదని, నగర పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని మరో ఫిర్యాదు చేశారన్నారు. చినకాపవరం డ్రెయిన్‌కు చేర్చి స్థానిక చేపల రేవు వద్ద అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని, దీంతో నీటి పారుదలకు ఇబ్బందిగా ఉందని ఫిర్యాదు చేశారని చెప్పారు. సాలిపేటలో మద్యం, గంజాయి సేవించి కొంత మంది యువకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని శలాకోట నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఇతర సమస్యలపైనా ప్రజలు అర్జీలు అందజేశారని వివరించారు.

# ఉపాధి బకాయిలు తక్షణమే చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న గోపాలన్

పెనుమంట్ర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్ల రెండు నెలలుగా ఉపాధి హామీ పనులు చేస్తున్నా కూలీలకు కూలి డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేతా గోపాలన్ విమర్శించారు. సోమవారం ఎస్ ఇల్లిందలపర్రు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో కాలువ తవ్వకం పనుల చేస్తున్న కూలీలతో ఆయన సమావేశం నిర్వహించారు. కూలీలకు గ్రామాల్లో పనులు లేవని, ఇప్పుడు ఉపాధి పనులే దిక్కయ్యాయని, వ్యవసాయ కార్మికులకు రెండు నెలలుగా డబ్బులు బకాయిలు పెట్టడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శమని వివరించారు. తక్షణమే అధికారులు జోక్యం చేసుకుని ఉపాధి కూలి బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 22న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో కూలీలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని మండల కార్యదర్శి కోడే ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో ఉపాధి కూలీల సంఘ నాయకులు డి.రామారావు, ఎం ధర్మారావు, టి.అనూషనాగలక్ష్మి, పి.దుర్గ, ఎం సుబ్బలక్ష్మి, బి.సత్యలక్ష్మి పాల్గొన్నారు.

### గ్రామ బహిష్కరణ దారుణం



ధర్నా చేస్తున్న దళిత సంఘ నాయకులు

నరసాపురం: కాకినాడ జిల్లా పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేసిన ఘటనలతో నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని మాలల ఐక్య వేదిక నరసాపురం నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కాకిలేటి ఆనంద్ మాట్లాడుతూ ఘటనపై డిప్యూటీ సీఎం ఇంతవరకు స్పందించకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోరింకల వినోద్‌కుమార్, పెరుమాల మహేష్, నల్లి ప్రసన్నకుమార్, నల్లి రాజు, కత్తిమండ నాని పాల్గొన్నారు.

# గోస్తనీ కాల్వ రోడ్డు అధ్వానం



జుత్తిగ వద్ద గోస్తనీ పంటకాల్ల గట్టుపై పైకి లేచిన రాళ్లు



జుత్తిగ గోస్తనీ డ్రెయిన్ వద్ద రోడ్డు గోతుల్లో నిలిచిన నీరు

మల్లిపూడి – జుత్తిగ రహదారిపై రాళ్లు పైకి లేవడంతో రాకపోకలకు అవస్థలు

పెనుమంట్ర: అత్తిలి – ఇరగవరం ఆర్అండ్‌బీ రోడ్డుకు అనుసంధానమైన మల్లిపూడి – జుత్తిగ కెనాల్ రోడ్డు అధ్వానంగా మారింది. రాళ్లు పైకి లేచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు. గతంలో జెడ్పీ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును ఆర్అండ్‌బీ శాఖకు అనుసంధానం చేశారు. ఒకవైపు గోస్తనీ పంట కాల్వ, మరోవైపు గోస్తనీ డ్రెయిన్ ఉన్న ఈ రోడ్డులో రెండు రైస్ మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లులకు ధాన్యం తీసుకొచ్చేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో డెల్టా ఆధునికీకరణలో మల్లిపూడి ఫుట్‌పాత్ వంతెన నుంచి జుత్తిగ పెద్ద వంతెన వరకు కొంతమేర గోస్తనీ కెనాల్‌లో రిటైనింగ్ వాల్స్ నిర్మించారు. తదుపరి వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో ఆర్ అండ్‌బీ అధికారులు ఈరోడ్డును పూర్తిగా విస్మరించింది. దీంతో నేడు ఈ రోడ్డంతా రాళ్లు లేచిపోయి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజు ఈప్రాంతం నుంచి తణుకు ప్రైవేటు పాఠశాలకు వెళ్లే చిన్న వ్యానులతో పాటు పెద్ద బస్సులు కూడా కెనాల్ రోడ్డునే రాకపోకలు సాగిస్తుంటాయి. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డుపై ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఈరోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**సీసీ రోడ్డు నిర్మించాలి**



మల్లిపూడి నుంచి జుత్తిగ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈ రోడ్డు పొడవునా నివాస గృహాలు ఉన్నాయి. సిమెంట్ రోడ్డుగా నిర్మించాలి. 1వ వార్డు పరిధిలో ఉన్న ఈ రోడ్డును సీసీ రోడ్డు, డ్రెయిన్‌లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి. గోస్తనీ పంట కాలువలో కొంతమేర రిటైనింగ్‌వాల్స్ నిర్మించాల్సి ఉంది.

– వెలగల సత్యనారాయణరెడ్డి, వార్డు మెంబర్, జుత్తిగ

**రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు**



మల్లిపూడి ఫుట్‌పాత్ బ్రిడ్జి నుంచి జుత్తిగలోని నత్తారామేశ్వరం – సిద్దాంతం రోడ్డు వరకు 750 మీటర్లు పొడవు గల ఈ రోడ్డును సిమెంట్ రోడ్డుగా, గోస్తనీ కెనాల్‌లో మిగిలిన భాగాన్ని రిటైనింగ్ వాల్స్ నిర్మించేందుకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. త్వరలో ఈరోడ్డు నిర్మాణానికి అనుమతులు రానున్నాయి.

– యశ్వంత్, ఏఈ, ఆర్అండ్‌బీ పెనుమంట్ర